క్లుప్తంగా

పరుష ఏర్పాట్ల పరిశీలన



పరుష ఏర్పాట్లపై చర్చిస్తున్న సీఐ

ముదిగుబ్బ: శివరాత్రి తర్వాత మండలంలోని సంకేపల్లి గ్రామం వద్ద జరిగే వీరనారాయణ స్వామి పరుష ఏర్పాట్లను శుక్రవారం ముదిగుబ్బ సీఐ కంబగిరి రాముడు, ఎస్‌ఐ హేమంత్‌కుమార్ పరిశీలించారు. భారీగా తరలివచ్చే భక్తులకు కల్పించిన ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు.

ఆశ్రమానికి ఎమ్మెల్యే రూ.లక్ష విరాళం

రామగిరి: మండల కేంద్రంలో బ్రహ్మకుమారీల ఆశ్రమ నిర్మాణానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి రూ.లక్ష విరాళం అందించారు. ఆశ్రమ నిర్మాణానికి తమవంతు సాయం చేయాలని గతంలో బ్రహ్మకుమారీలు ఎమ్మెల్యే ను కోరారు. దీంతో ఎమ్మెల్యే రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందించినట్లు బ్రహ్మకుమారి టీచర్ ప్రభావతమ్మ తెలిపారు. ఆ మొత్తాన్ని ఎంపీపీ కవిన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రమేష్, సర్పంచ్ మీనుగ నాగరాజు, నాయకులు దాసరి మోహన్, జనార్దన్, టీచర్ మాలగుండ్ల ముత్యాలప్ప శుక్రవారం అందజేశారు అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని తేరు బజార్‌లో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మూర్ఛవచ్చి కిందపడి గాయపడ్డాడు. స్థానికులు పోలీసులు గమనించి గాయపడిన వ్యక్తిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇతని వివరాలు తెలిస్తే వన్‌టౌన్ పోలీసులకు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

పెద్దమ్మతల్లి ఉత్సవాలు ప్రారంభం



గంగపూజకు తరలివెళ్తున్న పూజారి, భక్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో కొలువైన పెద్దమ్మ తల్లి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉరుములు వాయిద్యాల నడుమ పూజారి పెద్దన్న భక్తులతో తరలివెళ్లి గంగపూజ నిర్వహించారు. 18న అమ్మవారి ఊరేగింపు, 19న ప్రత్యేక అలంకరణ, పూజలు, 21న సాయంత్రం జ్యోతుల బోనాలను నిర్వహిస్తామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

కో–ఆప్షన్ సభ్యుడి మృతి

తనకల్లు: మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు ఎస్.ముస్తఫా అలియాస్ బాబు (56) అనారోగ్యంతో మృతి చెందాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈయన శుక్రవారం అస్వస్థతకు గురై మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈయన వైఎస్సార్‌సీపీలో చురుకైన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. ఎంపీడీఓ పూల నరసింహులు, మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ మాధవరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హేమశేఖర్‌రెడ్డి తదితరులు ముస్తఫా భౌతిక కాయానికి నివాళులర్పించారు.

ప్రశాంత జీవనం సాగించాలి

ఓడీ చెరువు: కక్షలు, కార్పణ్యాలకు తావు లేకుండా కలసి మెలసి ప్రశాంత జీవనం సాగించాలని గ్రామస్తులకు ఎస్‌ఐ గోపీ సూచించారు. చెరువుమునెప్ప గారిపల్లిలో శుక్రవారం ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై సమాచారం ఇవ్వాలని సూచించారు.

విజేతలకు అభినందనలు



చెక్కులు అందజేస్తున్న మసీదు పెద్ద

ధర్మవరం అర్బన్: విజయవాడలో ఈనెల 12న నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖురాన్ కంఠస్థ పోటీల్లో బి–గ్రూప్ విభాగంలో విజేతగా నిలిచిన ధర్మవరానికి చెందిన మహమ్మద్ రైహాన్, సి–గ్రూప్‌లో ఫైనల్ వరకు వెళ్లి ప్రతిభ చాటిన ఎండీ జైద్‌ను ఘనంగా సత్కరించారు. శుక్రవారం పట్టణంలోని జామియా మసీదులో వైస్ ముతవల్లి డాక్టర్ వలీసాబ్, కార్యదర్శి హైదర్‌వలి, మౌలానా అబు తాహీర్‌సాబ్ ఆధ్వర్యంలో సభ్యులు వారిని సత్కరించారు. అనంతరం వారికి రూ.21వేల చెక్కు అందించారు.


19న రవూఫ్ వర్ధంతి

కదిరి టౌన్: కామ్రేడ్ రవూఫ్ 9వ వర్ధంతిని ఈనెల 19న మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల వద్ద రవూఫ్ స్థూపం వద్ద నిర్వహిస్తున్నట్లు స్మారక కమిటీ అధ్యక్షుడు చంద్ర,రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

శివ పూజలకు సర్వం సిద్ధం

- మహా శివరాత్రికి ఆలయాల ముస్తాబు
- ఆలయాల వద్ద బారికేడ్లు ఏర్పాటు





తాడిమర్రి: ప్రత్యేక అలంకరణలో కాటికోటేశ్వరస్వామి



పుట్టపర్తి టౌన్: ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి

పుట్టపర్తి టౌన్: మహాశివరాత్రి పర్వదిన వేడుకలకు జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. ప్రత్యేక పూజలకు ఇతర కార్యక్రమాలకు నిర్వాహకులు, పురోహితుల సిద్ధం చేశారు. పుట్టపర్తి పట్టణంలో సత్యసాయి బాబా ప్రతిష్ఠించిన శివాలయాన్ని, హనుమాన్ ఆలయ ఆవరణంలో ఉన్న శివాలయాలను ప్రత్యేకంగా అలంకరించి ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం ఉదయం 6గంటలకు అభిషేకాలు, రాత్రి 10 గంటలకు పార్వతీ పరమేశ్వరి కల్యాణోత్సవం, రాత్రి 12గంటలకు లింగోద్భవ అభిషేకం, 19వ తేదీ ఉదయం గంటలకు అభిషేకం నిర్వహించనున్నారు. జాగారం, శివపార్వతుల కల్యాణం నేపథ్యంలో జిల్లాలో శైవ దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాడిమర్రి: తాడిమర్రి మండలం చిల్లవారిపల్లి శ్రీకాటికోటేశ్వర క్షేత్రం, తాడిమర్రి పురాతన శివాలయం, భైరవేశ్వర ఆలయం, కునుకుంట్ల, చిల్లకొండయ్యపల్లి గ్రామాల్లోని శివాలయాలకు రంగులు వేయడంతో నూతన శోభ నెలకొంది. కాటికోటేశ్వర క్షేత్రంలో మహాశివరాత్రి మరుసటి రోజున భారీగా జాతర జరగనుంది.

కొత్తచెరువు: శివరాత్రి ఉత్సవాలకు మండల కేంద్రం కొత్తచెరువులోని సంగమేశ్వర, సోమేశ్వర దేవాలయాలను రంగురంగుల దీపాలంకరణలతో ముస్తాబు చేశారు.

కదిరి టౌన్: పట్టణంలోని శివాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం శివ పార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శివాలయాలు మహాశివరాత్రి పండుగ సందర్భంగా విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబయ్యాయి. కాగా మహాశివరాత్రి పండుగకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్ల వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. శివానగర్‌లో శివాలయం వద్ద మొట్టమొదటిసారిగా రథోత్సవం నిర్వహిస్తున్నారని, అక్కడ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆలయాల వద్ద భక్తులు జాగారం చేస్తుండటంతో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల గస్తీని ఏర్పాటు చేశామని తెలిపారు



పోలీసులకు సూచనలిస్తున్న వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం



ధర్మవరం అర్బన్: విద్యుత్ దీపాలంకరణలో గాంధీనగర్ శివాలయం



కదిరిలోని శివాలయానికి విద్యుత్ దీపాలతో అలంకరణ

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



రాజగోపాల్‌రెడ్డి (ఫైల్)



రాజగోపాల్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి

బత్తలపల్లి: మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన సంజీవపురం కాటికోటేశ్వరక్షేత్రం ఆలయ ధర్మకర్త, వాటర్‌షెడ్ మాజీ ప్రెసిడెంట్, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజగోపాల్‌రెడ్డి (66) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. శివదీక్ష మాలధారులకు గురువారం కాటికోటేశ్వరక్షేత్రంలో ఇరుముడి కట్టి శ్రీశైలం వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. భజనలు, పూజల అనంతరం నిద్రకు ఉపక్రమిస్తున్న సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో కారులో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షిస్తుండగానే ఆయన మృతి చెందారు. రాజగోపాల్‌రెడ్డికి భార్య లక్ష్మీనరసమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గ్రామానికి చేరుకుని రాజగోపాల్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్లు ముష్టూరు నరసింహారెడ్డి, గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కమతం ఈశ్వరయ్య, జిల్లా నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, సర్పంచు చెడిపోతుల గోపాల్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు బోయ సాంబ, శాలివాహన సంఘం నాయకుడు వక్కల శ్రీరాములు నివాళులర్పించారు. సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రథోత్సవాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: పట్టణంలోని శివానగర్‌లోని పురాతన బచ్చునాగంపల్లి కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్న రథోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శివానగర్ శివాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి స్వామివారిని దర్శించుకుని అనంతరం నూతన రథాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతలు, ప్రజల సహాయ సహకారాలతో నూతనంగా రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. శనివారం మహాశివరాత్రి పండుగ సందర్భంగా తెల్లవారుజామున 5గంటలకు శివపార్వతుల కల్యాణం, 7.30గంటలకు మడుగుతేరు ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2గంటల వరకు భక్తుల కోసం రథాన్ని ఆలయం వద్దనే ఉంచుతారన్నారు. అనంతరం శివానగర్ ఆంజనేయస్వామి ఆలయం వరకు రథాన్ని లాగి తిరిగి కాశీవిశ్వనాథ స్వామి ఆలయం వద్దకు చేర్చుతారన్నారు. రథోత్సవం సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు. భక్తులు తరలివచ్చి పరమేశ్వరున్ని పూజించాలని సూచించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పెన్నం గోపీనాథ్, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్జేడీపై దాడి పిరికిపంద చర్య

కదిరి అర్బన్: పాఠశాల విద్య ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిపై ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు దాడికి పాల్పడటంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. దాడి ఘటనను పిరికిపంద చర్య అని వైఎస్సార్‌టీఎఫ్ కదిరి డివిజన్ నాయకులు అన్నారు. దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు శివయ్య, సుదర్శన్‌రెడ్డి, పుల్లారెడ్డి, శ్రీనివాసులు, రఘునాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాశాఖలో అత్యున్నత పదవులు చేపట్టి ఆ పదవులకు వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి ప్రతాప్‌రెడ్డి అని అన్నారు. ఎంఎల్‌సీ ఎన్నికలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలే తప్ప దాడులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎన్‌పీకుంట: ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డిపై దాడికి పాల్పడటం పిరికిపంద చర్య అని వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు వెంకటరామిరెడ్డి, ఆంజనేయులు నాయక్, శంకర్‌రెడ్డి, జయకుమార్‌నాయక్, పూర్ణానందరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్, ప్రతాప్ అన్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

తనకల్లు: పాఠశాల విద్య ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య అని మండల ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకుడు ఆదిశేషారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కదిరి అర్బన్: ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిపై విద్యార్థి సంఘాల నాయకులు దాడికి పాల్పడడం అమానుషమని కదిరి డివిజన్ మండల విద్యాధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ నాయకులు అన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులు చెన్నక్రిష్ణ, లలితమ్మ, క్రిష్ణానాయక్, వేమనారాయణ, ఖాదర్‌వలీ, తిరుపాల్‌నాయక్, జాన్‌రెడ్డెప్ప, ప్రధానోపాధ్యాయులు నాగరాజు, భాస్కర్‌రెడ్డి, వరప్రసాద్‌రాజు, ఓబుల్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి,శిరీష డిమాండ్ చేశారు.

నేడు పోట్లమర్రి ఆంజనేయస్వామి వార్షికోత్సవం

బత్తలపల్లి: మండలంలోని పోట్లమర్రి గ్రామంలో కొలువైన సీతారామాంజనేయస్వామి ఆలయ ఏడవ వార్షికోత్సవం, శివరాత్రి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించేందుకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. వేకువజామున శ్రీవిఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాజనము, కలశస్థాపన, పంచామృతాభిషేకం, సువర్ణ పుష్పార్చన, విశేషాలంకారాలు, మహా పూర్ణాహుతి జరుగనున్నాయని అర్చకులు తెలిపారు. అదే విధంగా శివరాత్రి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.



ఆంజనేయస్వామి మూలవిరాట్

ఉదాసీనంగా ఉంటే లక్ష్యసాధన ఎలా?

- సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి

కదిరి అర్బన్: ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని ఎంపీపీ అమరనాథ్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. హౌసింగ్ శాఖలో చాలా సమస్యలు తన దృష్టికి వస్తున్నాయని, వాటిని ఎందుకు పరిష్కరించడం లేదని హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నరసింహులను ఎంపీపీ నిలదీశారు. బిల్లులు పడక ఇబ్బందులు పడుతున్నట్లు లబ్ధిదారులు పేర్కొంటున్నారని, ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ సునీతను ఎంపీపీ ఆదేశించారు. పొజిషన్ సర్టిఫికెట్ల మంజూరులో జాప్యం జరిగితే ప్రభుత్వ లక్ష్యాలను ఎలా సాధిస్తామని ప్రశ్నించారు. మండలంలో కొందరు సర్వేయర్లు ప్రైవేటు వ్యక్తులకు మాత్రమే సర్వే పనులు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ రాధాబాయ్, ఎంపీడీఓ సుధామణి పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతతో పని చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రఫినాయక్

తలుపుల: సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఎస్.రఫినాయక్ అధికారులకు సూచించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. అనంతరం హౌసింగ్, పొజిషన్ సర్టిఫికెట్ల మంజూరు, ఉపాధి పనుల కల్పన, విద్యుత్ సమస్యలను పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సంచార పశు ఆరోగ్య సేవ వాహన సేవలను పాడి రైతులు వినియోగించుకోవచ్చని పశువైద్యాధికారి నారాయణస్వామి నాయక్ సూచించారు. ఉపాధి హామీ పనుల్లో బయటి ప్రాంతాలవారికి బిల్లులు మంజూరు చేశారని కొందరు సభ్యులు ఆరోపించగా విచారణ చేయిస్తామని ఎంపీడీఓ తెలిపారు. వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ రామానాయక్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ వైఎస్ కౌసల్య

తనకల్లు: అందరి సహకారంతో మండలాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని ఎంపీపీ వైఎస్ కౌసల్య అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ భవనంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజల సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటినుంచే ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. ఎంపీడీఓ పూల నరసింహులు, వైస్ ఎంపీపీలు సానే రమణమ్మ, నాగలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపండి



మాట్లాడుతున్న డీఎస్పీ యశ్వంత్

అమడగూరు: వీలైనంత వరకూ లోక్ అదాలత్‌లో రాజీద్వారా కేసులు పరిష్కరింపజేయాలని డీఎస్పీ యశ్వంత్ పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన అమడగూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కోర్టులో నడుస్తున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇరువర్గాల వారితో చర్చించి రాజీ చేయించి లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కర్ణాటక నుంచి మద్యం, గుట్కా సరఫరా కాకుండా అడ్డుకోవాలని సూచించారు. సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకటనారాయణ పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

కనగానపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఎలాంటి తీర్మానాలు లేకుండా అధికారులు మండల సర్వసభ్య సమావేశాన్ని మొక్కుబడిగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లోని పలు సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి దోహదపడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ పద్మావతి, పలువురు ఎంపీటీసీలు సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కదిరి అర్బన్: మండల పరిధిలోని కౌలేపల్లి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల తెలిపిన వివరాల మేరకు... పట్టణానికి చెందిన శంకరయ్య బైక్‌లో మొటుకుపల్లికి వెళ్తుండగా కౌలేపల్లి వద్ద కుక్క అడ్డం వచ్చింది. దీంతో బైక్ అదుపుతప్పి రోడ్డు దాటుతున్న చింతలప్ప అనే వ్యక్తిపైకి దూసుకెళ్లింది. దీంతో ఇరువురికీ గాయాలయ్యాయి. వీరిని కదిరి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటతో అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

శివరాత్రిని ప్రశాంతంగా జరుపుకోండి

అమడగూరు: మహాశివరాత్రి పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ వెంకటనారాయణ మండల ప్రజలకు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పండుగ రోజు భక్తులు భక్తిశ్రద్ధలతో ఉపవాసదీక్షలో ఉండి రాత్రంతా జాగరణ చేస్తారన్నారు. ఈక్రమంలో గ్రామాల్లో ఎవరైనా పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

తిమ్మమ్మమర్రిమాను ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు

- కదిరి ఆర్టీసీ డీఎం మైనుద్దీన్

ఎన్‌పీకుంట: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని తిమ్మమ్మమర్రిమాను వద్ద ఈనెల 18, 19వ తేదీల్లో జరిగే జాగరణ మహోత్సవాలకు కదిరి డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ బీడుపల్లి మైనుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కదిరి బస్టాండు నుంచి ప్రతి 30 నిమిషాలకు ఒక బస్సు చొప్పున 10 ప్రత్యేక బస్సులను గాండ్లపెంట, రెక్కమాను మీదుగా నడపనున్నట్లు తెలిపారు. కదిరి బస్టాండ్, జీవిమాను సర్కిల్, రెక్కమాను, కొక్కంటి క్రాస్ వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ప్రయాణికులకు వసతి కల్పిస్తున్నామన్నారు. చిత్తూరు జిల్లా నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ములకలచెరువు నుంచి కొక్కంటి క్రాస్ ద్వారా మూడు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ప్రత్యేక బస్సు సౌకర్యాలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామాపురంలో వైద్య సేవలు

తాడిమర్రి: ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవల్లో భాగంగా మండలంలోని రామాపురం గ్రామంలో శుక్రవారం 104 వాహన సిబ్బంది, ఎంపీహెచ్ఓ నారాయణస్వామి, ఎంఎల్‌హెచ్‌పీ సాయికీర్తన పర్యటించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు బీపీ, షుగర్, రక్త, మూత్ర పరీక్షలు చేసి, వైద్య చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటా తిరుగుతూ జబ్బులతో మంచం పట్టిన రోగులకు వైద్య చికిత్సలు అందించారు. తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పాలు, చేపలు, మాంసం తదితర పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు సూచించారు.

19న గుండె వైద్య శిబిరం



పోస్టర్లు విడుదల చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నాగరాజు తదితరులు

ధర్మవరం: స్థానిక తేరుబజార్‌లోనున్న ఆర్యవైశ్య కొత్త సత్రంలో ఈనెల 19న గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ పెనుజూరు నాగరాజు తెలిపారు. ఈమేరకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వడ్డె శీన, బోయ నరసింహులతో కలిసి శుక్రవారం పోస్టర్లు విడుదల చేశారు. కిమ్స్ సవేరా ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో జీఆర్‌బీఎస్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేస్తారన్నారు.

కాశిరెడ్డినాయనకు పూజలు



ప్రత్యేక అలంకరణలో కాశిరెడ్డినాయనస్వామి

ధర్మవరం: పట్టణంలోని ఇందిరానగర్‌లో కొలువైన కాశిరెడ్డినాయన ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి రోజున ఉదయం స్వామివారికి అభిషేకం, ఆకుపూజ, విశేష అలంకరణ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆశ్రమం అధ్యక్షుడు కణేకంటి శివారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శంకర చౌడప్పలు తెలిపారు.

పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా

నల్లమాడ: వివాహిత అదృశ్యం కేసులో పోలీసులు కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. బాధితురాలి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ వివాహిత అదృశ్యంపై జనవరి 25న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, నేటికీ ఆచూకీ లభించలేదన్నారు. కాల్‌డేటా సేకరించామని, త్వరలో ఆ మహిళ ఆచూకీని గుర్తిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.